క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



శివాలయంలో హోమం చేస్తున్న బానాది గ్రామపెద్దలు

వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న శివాలయం వార్షికోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఆలయ అర్చకులు మేడపాటి కిశోర్‌శర్మ ప్రత్యేక పూజలు, హోమం, మండపారాధన చేశారు. సోమవారం అభిషేకాలు, అష్టోత్తరశతనామ పూజలు, శివపార్వతుల కల్యాణం జరిపించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పరామర్శ



రమణమూర్తి కుటుంబీకులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శృంగవరపుకోట: మండలంలోని పెదఖండేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఎర్రపాటి రమణమూర్తి ఇటీవల మరణించారు. ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆదివారం పరామర్శించారు. రమణమూర్తి మృతిపై సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు వాకాడ రాంబాబు, ఎర్రపాటి సూర్యనారాయణ, రంభ వెంకటరమణ, తదితరులు ఉన్నారు.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకాలు



అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ నేతృత్వంలో అమ్మవారికి ఆదివారం పంచామృతాభిషేకాలు చేశారు. తెల్లవారు జామున 4 గంటల నుంచే అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని భక్తుల దర్శనార్థం అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో దాతల సహకారంతో అమ్మవారి దేవస్థానంలో భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలందుకుంటున్న వెంకటేశ్వరస్వామి

జామి: మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యా యి. వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివాకి అభిషేకాలు చేసి, విశేషంగా అలంక రించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశా రు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం స్వామివారి కల్యాణం జరిపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు క్యాన్సర్ నిర్ధారణ వైద్యశిబిరం

శృంగవరపుకోట: రాజీపేట వద్ద ఉన్న శంబలనగరిలో గాయత్రీ దేవి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం సత్యసాయి ట్రస్ట్ నేతృత్వంలో క్యాన్సర్ నిర్ధారణ ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గాయత్రీ దేవి జయంతి సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే కె.ప్రేమసాగర్‌రావు, సురేఖ దంపతులు పాల్గొంటారని తెలిపారు.

కళాశాల మంజూరుపై ధన్యవాద తీర్మానం

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జామికి జూనియర్ కళాశాల మంజూరు
- మండల సర్వసభ్య సమావేశంలో ధన్యవాదాలు తెలిపిన సభ్యులు
- సర్పంచ్‌ల ప్రొటోకాల్‌ను అధికారులు తుంగలో తొక్కుతున్నారని ధ్వజం



సర్వసభ్యసమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సబ్బవరపు అరుణ

జామి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మండల కేంద్రం జామిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయడంపై మండల పరిషత్ సభ్యులు ధన్యవాదాలు తెలుపుతూ ఏక గ్రీవ తీర్మానం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ అధ్యక్షతన ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకూడదని చింతాడ సర్పంచ్ ఏ.సుబ్రహ్మణ్యం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ్యులు ఏకగ్రీవం గా ఆమోదించారు. అనంతరం చింతాడ, విజినిగిరి సర్పంచ్‌లు సుబ్రహ్మణ్యం, సూర్యారావు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కొందరు అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడం ప్రారంభించారని, గ్రామాల్లో రైతులకు వరి విత్తనాల పంపిణీ చేసే కార్యక్రమాల్లో సంబంధిత అధికా రులు సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వకుండా టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పంపిణీ చేయిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని అధికారులే అపహాస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జామి జూనియర్ కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్లకు సంబంధించి నిర్వహించిన సమావేశంలో టీడీపీ నేతలతో జామి హైస్కూల్‌లో సమావేశం నిర్వహించారని, మండలంలోని సర్పంచ్‌లకు కాని, ఎంపీపీ, జెడ్పీటీసీకి కాని ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, ఇది అధికారుల అత్యుత్సాహం కాదా అని ధ్వజమెత్తారు.

అధికారులు రాజకీయాలు చేయడం తగదు

జెడ్పీటీసీ గొర్లె సరయు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఒక పార్టీనేతలతో సమావేశం నిర్వహించడం చట్ట విరుద్ధమని అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో జామికి జూని యర్ కళాశాల మంజూరైందని, ఇది పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. అలాంటి కళాశాల విషయంలో అధికారులే రాజకీయాలు చేయడం తగదన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులను అధికారులు ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించారు. కళాశాల విషయంలో రాజకీయాలు చేస్తే ఆ చర్యలు కళా శాల అభివృద్ధికి ఆటంకంగా మారే ప్రమా దం ఉందని అన్నారు. వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు మాట్లాడు తూ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణాల్లో భాగంగా అలమండ,జామి గ్రామాల్లో శ్మశాన వాటికలు లేకుండా పోయాయని, శ్మశాన వాటికల పునరుద్ధ రణకు సంబంధిత అధికారులు స్థలాలు కేటాయించి సమస్య పరిష్కరించాలని కోరారు. భీమసింగి ఎంపీటీసీ ధనియాల హైమావతి మాట్లాడుతూ చెరువుల్లో మట్టిని కొంతమంది అక్రమంగా ఇటుక బట్టీ ల నిర్వహణకు అమ్మకాలు చేస్తున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ రాంబాయి స్పందిస్తూ అక్రమ మట్టితవ్వకాల విషయం తమ దృష్టికి వచ్చిందని దీనిపై విచారణ చేయిస్తున్నామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలో 20 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, సర్వేకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా దరఖాస్తు చేసుకుంటే పరిష్కరిస్తామని తహసీల్దార్ చెప్పారు. వైస్ ఎంపీపీలు జి.వెంకటరావు,ఎన్నింటి ఆదిలక్ష్మి, ఎంపీడీఓ తిరుమలరావు,హౌసింగ్ ఏఈ వెంకటరావు, పీఆర్ డీఈ స్వామినాయుడు, వైద్యాధికారి పద్మావతి, ఏపీఓ కిరణ్మయి, ఇరిగేషన్ షేఈ కృష్ణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఆర్.రుూన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో పంపిణీకి సిద్ధంగా వరి విత్తనాలు

దత్తిరాజేరు: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు రాయితీపై పంపిణీ చేసేందుకు మండలం లోని 17 రైతు భరోసా కేంద్రాల్లో(ఆర్బీకే) వరివిత్తనాలు సిద్ధం చేశామని ఏఓ అనురాధ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 9000 ఎకరాలు కాగా రైతులకు 2,700 కింటాళ్ల విత్తనాలు అవసరమని గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు. 2100 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో రైతులకు వాటిని పంపిణీ చేస్తామని తెలిపారు.

వరి విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు

చీపురుపల్లి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు రాయితీపై వరి విత్తనాలను మండలంలోని కర్లాం రైతుభరోసా కేంద్రంలో చీపురుపల్లి సబ్ డివిజన్ ఏడీఏ ఎన్.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్లాం రైతుభరోసా కేంద్రంలో ఎంటీయూ -1121 రకం వరి విత్తనాలు 1155 క్వింటాళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు,ఏఓ సీహెచ్.రఘునాథ్, వ్యవసాయ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

బొండపల్లి: రోజూ ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా శిక్షకులు భీమనేని వంశీకిరణ్ అన్నారు. గొట్లాం గ్రామంలోని పిరమిడ్ సేవాదళ్ ఆశ్రమం లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలు గు గంటల వరకు ఆదివారం నిర్విరామ ధ్యానం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వంశీకిరణ్ ధ్యానం అవశ్యకతను వివరించారు. నేటి ఆధునిక యుగంలో అన్ని రంగాల్లోని వారు తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటూ రోగా ల పాలవుతున్నారని అన్నారు. మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు ధ్యానం ఒక్కటే మార్గమని చెప్పారు. ప్రతి ఒక్కరూ యోగా,ధ్యానం చేయాలని చెప్పారు. పిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ వి.రామకృష్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీనివాస్‌కు ఘన స్వాగతం

- మంత్రికి ఘన స్వాగతం



గజపతినగరం రూరల్: మంత్రి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు



గంట్యాడ: ఎల్లమ్మ తల్లిని దర్శించుకుంటున్న మంత్రి శ్రీనివాస్ దంపతులు

గజపతినగరం రూరల్: రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాల మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి నియోజకవర్గ కేంద్రానికి తొలిసారిగా వచ్చిన కొండపల్లి శ్రీనివాస్‌కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గంలోని అయిదు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు ఆయా శాఖల అధికారులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న మంత్రి శ్రీనివాస్

గంట్యాడ: మండల కేంద్రంలోని ఎల్లమ్మ తల్లిని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దంపతులు ఆది వారం దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలో ఉన్న వారి స్వగృహానికి వెళ్లారు. అతర్వాత విజయనగరం బయలు దేరి వెళ్లారు. ఆయన వెంట కొండపల్లి కొండలరావు తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం



మొక్కలు నాటుతున్న జియో ఆర్గనైజేషన్ సభ్యులు

శృంగవరపుకోట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని స్థానిక గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) వ్యవస్థాపకులు బి.రామకృష్ణ అన్నారు. ఫాదర్స్ డే సందర్భంగా జియో నేతృత్వంలో పెదఖండేపల్లి రహదారిలో ఆదివారం మొక్కలు నాటారు. సిమ్ ఉప కన్వీనర్ వి.నాగేశ్వరరావు, జియో ఆర్గనైజేషన్ సభ్యులు వై.విజయలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న యువత

- సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన, వైద్యశిబిరాలు



వైద్యశిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

గజపతినగరం: రక్తదానం ప్రాణదానంతో సమానమని, అపోహలు వీడి యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ప్రపంచ మానవ హక్కుల సంఘం సౌత్ ఇండియా మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ చింతా శారద అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఆదివారం నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలను ఆమె ప్రారంభించారు. శిబిరంలో 25 మంది యువత రక్తదానం చేశారు. అలాగే వైద్య శిబిరంలో గైనకాలజిస్ట్ జె.సుధ 125 మంది మహిళలకు సేవలందించారు. చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ బి.ఎస్.ఎస్.శ్రీనివాస్ 80మంది చిన్న పిల్లలకు వైద్యపరీక్షలు చేశారు. శిబిరాలు నిర్వాహించిన సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ గౌరవాధ్యక్షురాలు బెహర రమ్యను డాక్టర్ చింతా శారద అభినందించారు. సాధన యువజన సంఘం అధ్యక్షుడు పి.దుర్గాప్రసాద్, అమ్మ సేవ ఫౌండేషన్ అధ్యక్షుతు డి.సురేష్,ఎం.తాతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



వేపాడ మెయిన్‌రోడ్డులో విద్యుత్ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

వేపాడ: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఈదురుగాలులతో కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభాలు విరిగిపోయి సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ సిబ్బంది ఆదివారం మరమ్మతులు నిర్వహించి సరఫరాను పునరుద్ధరించారు. వేపాడ విద్యుత్ శాఖ ఏఈ సూరిబాబు మాట్లాడుతూ ఈదురు గాలులకు వేపాడ, పెదగుడపాల, రామస్వామిపేట సమీపంలో చెట్ల కొమ్మలు విరిగి పడడంతో పాటు గాలికి సుమారు 15 స్తంభాలు కూలిపోయాయని తెలిపారు. సుమారు రూ.3 లక్షలు నష్టం వాటిల్లిందని చెప్పారు. పెదగుడిపాల,వేపాడలో విరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి వేశామని తెలిపారు. వేపాడ మెయిన్‌రోడ్డులో ఆదివారం రాత్రికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించామన్నారు. సోమవారం నాటికి వేపాడలో మిగిలిన స్తంభాలను వేసి పూర్తి స్థాయిలో విద్యుత్‌సరఫరా పునరుద్ధరించనున్నట్లు పేర్కొన్నారు. కె.ఆర్.పేట,దబ్బిరాజుపేట, వల్లంపూడి, చామలాపల్లి, కరకవలస,బొద్దాం, రామస్వామిపేట, పాటూరు, సోంపురం తదితర గ్రామాల్లో చిన్న చిన్న మరమ్మతులు ఉంటే వాటిని శనివారం రాత్రే చేసి అర్ధరాత్రి తర్వాత విద్యుత్ సరఫరా చేశామని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుర్ల: మండలంలోని గుర్ల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో సోమవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ డీఈ పి.హరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుజ్జింగివలస, గోషాడ, తెట్టంగి, పోలాయవలస, చుక్కపేట, చోడ వరం ,పెనుబర్తి, చింతపల్లిపేట, గంగిరెడ్లపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గృహకార్మికులకు రక్షణగా చట్టం




సమావేశంలో మాట్లాడుతున్న చిట్టిబాబు

- డీబీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు

విజయనగరం ఫూల్‌బాగ్: గృహ కార్మికులకు రక్షణగా సమగ్ర చట్టం తీసుకురావాలని డీబీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. చిట్టిబాబు అన్నారు. డొమెస్టిక్ వర్కర్స్ ఫెడరేషన్, డీబీఎస్‌యూ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఆదివారం స్థానిక యూత్ హాస్టల్‌లో ఇంటర్నేషనల్ డొమెస్టిక్ వర్కర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసంఘటిత రంగంలో అత్యధికంగా ఉన్న గృహ కార్మికులకు రక్షణగా సమగ్ర చట్టం రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం గృహ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ ఫర్ డవలప్‌మెంట్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కలివేల ఎలిషా కుమారి, శ్రామిక మహిళా విభాగం కన్వీనర్ జామి దేవి, డొమెస్టిక్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు సియాదుల పార్వతి, సమాజ చైతన్య స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి చింత జ్యోతి, ఏరియా కో ఆర్డినేటర్స్ కింతలి పార్వతి, హసీనా బేగం, బి.పుణ్యవతి సీహెచ్.చాందిని, బొత్స అప్పలనారాయణ, బి. భాను, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి



మీడియాతో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్‌కు కనీసం వేతనంగా రూ. 12 వేలు ఇవ్వాలని వర్కర్స్ సంఘ నాయకురాలు ఎస్‌కే బేగం డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కస్పా హైస్కూల్‌లో వర్కర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎ. జగన్‌మోహనరావు, నందిని మాట్లాడుతూ.. 2, 3 నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించడంతో పాటు ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఆయాలకు రెమ్యూనిరేషన్ ఇవ్వాలని కోరారు. పార్ట్ టైమ్ అని చెప్పి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు పని చేయిస్తున్నారని చెప్పారు. పనిని బట్టి కార్మికులకు నెలకు 12 వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. అలాగే యూనిఫారం, గుర్తింపు కార్డులు, క్యాజువల్ సెలవలు మంజూరు చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న మధ్యాహ్నం ఒంటి గంటలకు విజయనగరం మండల విద్యాశాఖ అధికారిని కలవనున్నామని, వర్కర్స్ అందరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో అతిజా బేగం, పార్వతి, సత్యవతి, చిన్నతల్లి, లత, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అలవాటు 'బడి'తే చాలు..

- పునఃప్రారంభమైన పాఠశాలలు
- విద్యార్థులను సన్నద్ధం చేయడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం



పాఠశాలకు వెళ్తున్న చిన్నారులు

విజయనగరం: వేసవి సెలవులు ముగిశాయి.. బడి గంటలు మోగాయి.. పుస్తకాలు, చదువులతో కుస్తీ పట్టిన పిల్లలంతా సెలవులు రాగానే అమ్మమ్మ, తాతయ్య, బంధువులతో కలిసి ఇప్పటివరకు కాలక్షేపం చేశారు. బడి తలుపులు తెరవడంతో ఇక బడిబాట పడుతున్నారు. సుమారుగా నెలన్నర రోజులు స్నేహితులు, బంధువులు, సెల్‌ఫోన్‌లు, ఆటపాటలతో హాయిగా.. ఎలాంటి ఒత్తిడి లేకుండా గడిపిన పిల్లలు ఇప్పుడన్నీ వదిలి ఒక్కసారిగా బడికి వెళ్లాలంటే కొంత ఇబ్బందే. ప్రాథమిక స్థాయి పిల్లలకైతే ఎంతో బద్ధకంగా ఉంటుంది. ఈ తరుణంలో వీరిని తిరిగి బడికి సన్నద్ధం చేస్తూ.. గాడిన పెట్టాలంటే తల్లిదండ్రులకు తలకు మించిన భారమే. కానీ కొంత ఓర్పు, శ్రద్ధతో వారిలో మెల్లమెల్లగా మార్పు తీసుకొస్తూ సన్నద్ధం చేస్తేనే చదువుకునే అవకాశముంది.

సరదాగా గడపాలి..

పాఠశాలకు అలవాటయ్యే వరకు ఉపాధ్యాయులు పిల్లలతో సరదాగా గడపాలి. పాటలు పాడించడం, పదాలతో ఆటలు, పద్యాలు, గణితంలో సరదాగా చతుర్విధ ప్రక్రియలు నేర్పుతూ వారికి ఇష్టం పెరిగేలా చూడాలి. ఇతర విద్యార్థులతో పోల్చకుండా చిన్న జవాబు చెప్పినా మెచ్చుకోవాలి. వీరిలో ఉన్న ప్రతిభను గుర్తించి అందుకు సంబంధించిన విషయాలు చెబితే ఉత్సాహంగా ఉంటారు. కొద్ది రోజుల పాటు హోమ్ వర్కు లేకుండా చూడాలి. ప్రారంభం నుంచే హోమ్‌వర్కు ఇస్తే భారంగా అనిపిస్తుంది.

తల్లిదండ్రుల పాత్రే కీలకం

వేసవి సెలవులు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఆటపాటలతో సందడిగా గడిపిన చిన్నారులు తిరిగి బడిబాట పట్టే విషయంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం. బడి ఉన్న సమయంలో ఉదయం నిద్రలేచి త్వరగా తయారయ్యేవారు. కానీ సెలవుల్లో అలా కాదు.. ఎప్పుడో రాత్రికి కాని నిద్రించకపోవడం.. ఉదయం ఆలస్యంగా నిద్ర లేవడం.. సమయానికి భోజనం చేయకపోవడం వంటివి జరిగాయి.. ప్రస్తుతం చిన్నారులను వేకువ జామునే గట్టిగా అరుస్తూ లేపకుండా మెల్లగా లేపుతూ వారిలో మార్పు తీసుకురావాలి. కొత్త పుస్తకాలు, కొత్త బ్యాగులు, బూట్లు, ఇతర సామగ్రి కోసం పిల్లలతో కలిసి షాపింగ్ చేస్తే ఉత్సాహంతో బడికి పోవడానికి ఇష్టపడతారు. బడి నుంచి ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత హోంవర్కు కొద్ది రోజుల పాటు తల్లిదండ్రులే దగ్గరుండి చేయిస్తే విద్యార్థులకు కొంత వెసులుబాటుగా ఉంటుంది. ఆ తర్వాత వారే సొంతంగా చేసుకుంటారు.

ఇంటిలో నేర్చుకునేలా..

ఇప్పుడే కొత్తగా బడికి వెళ్లే పిల్లలది మరో సమస్య. మూడేళ్లు నిండితే చాలు పాఠశాలకు పంపిస్తున్నారు. ఇప్పటి వరకు అమ్మానాన్న, కుటుంబ సభ్యులతో గడిపిన పిల్లలు పాఠశాలకు వెళ్లాలంటే మారాం చేస్తారు. వారిలో పాఠశాలలకు వెళ్లాలనే ఉత్సాహం నింపాలి. అందమైన బొమ్మలతో కూడిన సంచులు, ఆట వస్తువులు ఇవ్వడంతో పాటు ఇంటి వద్దనే అక్షరాలు, చిన్న చిన్న పదాలు నేర్పిస్తే హుషారుగా ఉంటారు. వీటితో పాటు రైమ్స్, కథలు, బొమ్మలు చూపిస్తూ పదాలు చెప్పించాలి. ఒకటో తరగతి, ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలకు ఉపయోగకరంగా ఉండే చార్టులు పిల్లల ఎత్తుకు సరిపడేలా ఇంటిలో గోడలకు అతికించాలి.

ఉత్సాహం నింపాలి..

నెలన్నర రోజుల వరకు పుస్తకాలు, చదువు ఏవీ లేకుండా పిల్లలు హాయిగా గడిపారు. ఒక్కసారిగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకే చోట.. ఒకే గదిలో కూర్చొని పాఠాలు వినాలంటే ఇబ్బందే. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లల్లో ఎప్పటికప్పుడు ఉత్సాహం నింపాలి. తరగతి గదిలో ఉపాధ్యాయులు విద్యార్థులకు తగిన స్వేచ్ఛ కల్పిస్తూ ఆటపాటలతో సరదాగా బోధించాలి.

– కె.శ్రీనివాసరావు, చిన్నపిల్లల వైద్య నిపుణుడు, విజయనగరం.